సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 19 । జూలై । 2023



నో హెల్మెట్.. నో ఎంట్రీ!

హెల్మెట్ నిబంధనను పోలీసు శాఖ కఠినంగా అమలు చేయనుంది. ఈ నెల 19 నుంచి భీమవరంలో నో హెల్మెట్.. నో ఎంట్రీ కార్యక్రమం చేపట్టనుంది. 8లో ▸



ఎస్ఈబీ దాడుల్లో మద్యం సీజ్

చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి భారీగా మద్యం, సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే బెల్లపు ఊట ధ్వంసం చేశారు. 8లో ▸



మద్ది అంజన్నకు ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్: శ్రీమద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు.

తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం

- జిల్లాలో 10 ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు
- మార్కెట్ ధర కంటే కిలోకు రూ.5 నుంచి రూ.9 తక్కువకే విక్రయం





పాలకొల్లు, భీమవరం రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్‌లో బియ్యం విక్రయిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మార్కెట్‌లో బియ్యం ధరల్ని నియంత్రిస్తూ..ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన బియ్యాన్ని అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు హోల్‌సేల్ బియ్యం వ్యాపారుల సహకారంతో ఈ ప్రత్యేక కౌంటర్లు నడుపుతున్నారు. బయట మార్కెట్ ధరల కంటే రూ.5 నుంచి రూ.9 వరకూ తక్కువకు అమ్మకాలు చేస్తున్నారు. ఈ బియ్యం కౌంటర్లకు ప్రజల నుంచి స్పందన వస్తుంది.

ఇంతవరకు 38 క్వింటాళ్ల బియ్యం అమ్మకం

జిల్లాలో ఏర్పాటుచేసిన 10 ప్రత్యేక బియ్యం అమ్మకం కౌంటర్ల ద్వారా గత నాలుగు రోజులుగా 256 మంది వినియోగదారులు 38 క్వింటాళ్ల బియ్యాన్ని కొనుగోలు చేశారు. సాధారణ రకం, ఫైన్ రకం/సూపర్ ఫైన్ రకాల బియ్యాన్ని ఈ కౌంటర్లలో విక్రయిస్తున్నారు. సాధారణ రకం(స్వర్ణ) బయట మార్కెట్లో కిలో రూ.42 ఉంటే ఈ ప్రత్యేక కౌంటర్‌లో కిలో రూ.34కు విక్రయిస్తున్నారుఫైన్ రకం బయట రూ.45 ఉంటే ఈ కౌంటర్‌లో రూ.40కి అమ్ముతున్నారు. సూపర్ ఫైన్ రకం బియ్యం బయటి మార్కెట్‌లో రూ.55 ఉంటే ప్రత్యేక కౌంటర్‌లో రూ.46కి విక్రయిస్తున్నారు. కిలోకు రూ.5 నుంచి 9 వరకు త గ్గించి ఈ కౌంటర్ల ద్వారా బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నారు.

జిల్లాలో భీమవరం రైతు బజార్, పాలకొల్లు రైతు బజార్, నరసాపురం రైతు బజార్, ఆకివీడు అజంతా కాంప్లెక్స్, ఉండి సొసైటీ భవనం, అత్తిలి చాంబర్ ఆఫ్ కామర్స్, తణుకు ఆర్యవైశ్య కళ్యాణ మండపం, ఆర్‌బీకే మొగల్లు, తాడేపల్లిగూడెం చాంబర్ ఆఫ్ కామర్స్ , పెనుగొండ చిట్టూరి వారి వీధి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించిన బియ్యం వివరాలు

కౌంటర్	వినియోగదారుల సంఖ్య	బియ్యం క్వింటాళ్లు
భీమవరం రైతుబజార్	52	762
పాలకొల్లు రైతుబజార్	28	294
నర్సాపురం రైతుబజార్	24	196
అత్తిలి	24	369
తణుకు	19	330
పాలకోడేరు	22	485
ఆకివీడు	29	488
ఉండి	30	391
తాడేపల్లిగూడెం	18	330
పెనుగొండ	10	198

ప్రత్యేక కౌంటర్లను ఉపయోగించుకోవాలి



బయట మార్కెట్లలో బియ్యం ధరలను నియంత్రిస్తూ జిల్లాలో 10 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి నాణ్యమైన బియ్యాన్ని తక్కువ ధరకే విక్రయిస్తున్నాం.ఈ కౌంటర్లలో ప్రజలకు అవసరమైన 3 రకాల బియ్యాన్ని అమ్ముతున్నారు.ప్రత్యేక కౌంటర్లను ప్రజలు ఉపయోగించుకోవాలి.

– ఎస్.రామ సుందర్‌రెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్

నూరు శాతం సంక్షేమమే లక్ష్యం

కలెక్టర్ ప్రశాంతి

అత్తిలి: సంక్షేమ పథకాలను నూటికి నూరుశాతం అర్హులకు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం స్కిన్నెరపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రత్యేక క్యాంపులో కలెక్టర్ పాల్గొన్నారు. హెల్ప్ డెస్క్, ఆధార్ నమోదు కేంద్రం, వైద్య శిబిరం తదితర ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ ప్రత్యేక క్యాంపులో ప్రజలకు 500 వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేస్తున్నామని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల మంజూరులో సరైన ధ్రువపత్రాలు లేనికారణంగా పథకాలు అందలేని వారిని గుర్తించి వారికి కూడా పథకాలను అందించాలన్నదే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, సర్పంచ్ అడ్డాల భానులలిత మహాలక్ష్మి, ఎంపీటీసీ కూరాకుల లక్ష్మి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు తమ్మాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

భవిష్యత్ విద్యుత్ వాహనాలదే



నూజివీడు ట్రిపుల్ ఐటీలో సెమినార్ ప్రారంభిస్తున్న చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్, ఇతర గ్లోబల్ వార్మింగ్ వాయువుల్ని గణనీయంగా తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలన్నా, తరిగిపోతున్న ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా విద్యుత్ వెహికల్స్ తయారీ రంగాన్ని అభివృద్ధి చేసుకోవడం ఒక్కటే మార్గమని ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి అన్నారు. స్థానిక ట్రిపుల్ ఐటీలో మంగళవారం ఎలక్ట్రిక్ వెహికల్ డిజైన్, తయారీపై వర్క్‌షాపు నిర్వహించారు. దీనిని ప్రారంభించిన చాన్సలర్ మాట్లాడుతూ ఇంధనాలను మండించడం ద్వారా వాతావరణంలో కార్బన్ డై ఆక్సైడ్ శాతం రోజురోజుకు పెరిగిపోయి అనేక దుష్ఫలితాలకు దారితీస్తుందన్నారు. ఈ నేపథ్యంలో రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే విద్యుత్ శక్తితో నడిచే వాహనాలను అభివృద్ధి చేసుకోవడమే మన ముందున్న ముఖ్యమైన కర్తవ్యమన్నారు. భవిష్యత్ అంతా విద్యుత్ వాహనలదేనన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకశక్తిని పెంపొందించే విధంగా సెమినార్‌లను తరచూ నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌కు చెందిన స్కైరైడర్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ట్రైనింగ్ అండ్ సేల్స్ విభాగం జనరల్ మేనేజర్ సిద్ధాంత్ పట్నాయక్ మాట్లాడుతూ రాబోయే కాలమంతా ఎలక్ట్రిక్ వెహికల్స్‌దేనన్నారు. ఈ సెమినార్‌లో వాహన రూపకల్పన సిద్ధాంతాలు, డిజైన్‌ల తయారీ తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ హెడ్ ఆచార్య కే వియన్నారావు, చాన్సలర్ సలహాదారు ఆచార్య సుధాకర్‌బాబు, ఏవో పీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.


ఆగస్టు 15 నుంచి ఆన్‌లైన్‌లో పన్నుల చెల్లింపు



ప్రత్తిపాడు సచివాలయం వద్ద మాట్లాడుతున్న డీపీవో మల్లికార్జునరావు, తదితరులు

పెంటపాడు: గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నుల కోసం ఇక నుంచి ప్రత్యేక విధానం ద్వారా ప్రభుత్వం సరికొత్త స్కీం ప్రవేశపెడుతున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు వెల్లడించారు. మంగళవారం ఆయన ప్రత్తిపాడులో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా మాట్లాడారు. ప్రజలు గ్రామ పంచాయతీలకు చెల్లించాల్సిన పన్నులు ఇక నుంచి పారదర్శకత ఉండేలా ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. పన్నుల కోసం ఏ గుమస్తా ఇంటికి రారని, ఏ గుమస్తాకు ఇక నుంచి పన్నులు చెల్లించే అవసరం లేకుండా ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా కొత్త యాప్ ఏర్పాటు చేస్తుందన్నారు. ఆగస్టు 15 నుంచి ఈ విధానం అమలులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు తమ ఫోన్‌లో యాప్ డౌన్‌లోడ్ చేసుకొని యూపీఐ ద్వారా నగదు చెల్లించే ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు డీపీవో వెల్లడించారు. ఈ విషయంపై వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గ్రామాల ప్రజలకు ఇప్పటి నుంచే అవగాహన కల్పించాలన్నారు.

సేవాభావాన్ని చాటుకున్న పోలీసులు



పులిరామన్నగూడెంలో గిరిజన విద్యార్థులకు కంచాలు, గ్లాసులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పోలవరం సబ్‌డివిజన్ పోలీసులు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. పులిరామన్నగూడెంలో జరిగిన హత్య సంఘటనను ఛేదించిన పోలీసులు పాఠశాలలోని విద్యార్థులు, తల్లిదండ్రుల్లో మనోధైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. పోలవరం డీఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాలతో గిరిజన సంక్షేమ వసతిగృహాన్ని సందర్శించి విద్యార్థులతో మమేకమై వారిలో మనోధైర్యాన్ని నింపుతూ వారితోనే భోజనం చేశారు. మంగళవారం కూడా వసతిగృహాన్ని సందర్శించిన డీఎస్పీ శ్రీనివాసులు 125 మంది విద్యార్థులకు స్టీల్ కంచాలు, 125 గ్లాసులు, మంచినీటి బాటిల్స్, చాక్లెట్స్, బిస్కెట్లు పంచి సేవా భావాన్ని చాటారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న టీడీపీ

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్



అబ్బిరాజుపాలెంలో లబ్ధిదారులకు ధ్రువ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: జగనన్న ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయడం టీడీపీ నేతలకు కంటగింపుగా మారిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ విమర్శించారు. అబ్బిరాజుపాలెం గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో టీడీపీ ఉనికి కోల్పోయే పరిస్థితి ఏర్పడడంతో అసత్య ప్రచారాలకు, తప్పుడు ఉద్యమాలకు ఊపిరి పోస్తున్నారని ఆరోపించారు. దగ్గులూరులో రూ.475 కోట్లతో నిర్మిస్తున్న వైద్య కళాశాల స్థల పూడికకు దొడ్డిపట్ల పరిసర లంకల నుంచి మట్టి తీసుకెళ్లి పూడిక చేయడానికి ప్రయత్నిస్తే టీడీపీ స్థానిక నాయకులు ఏటిగట్టు దిగువున ఉన్న ప్రజలను ఎగదోసి ఆ మట్టి తీయకూడదని అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు అదే టీడీపీ నాయకులు దగ్గులూరు వెళ్లి అక్కడ వైద్య కళాశాల నిర్మాణ ప్రాంతానికి వెలుపల ఉన్న ఖాళీ ప్రదేశంలో సెల్ఫీలు దిగుతూ కళాశాల పనులు ఇంకా ప్రారంభించలేదనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అభివృద్ధిని అడ్డుకున్న వారే ఇప్పుడు అభివృద్ధి జరగలేదని ర్యాలీలు చేయడం వారి స్వభావానికి నిదర్శనం అన్నారు. జిత్తులమారి నక్క పనులు చేస్తున్న ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుకు ప్రజలు తగినరీతిలో బుద్ధి చెప్పాలని శ్రీనివాస్ ప్రజలను కోరారు. మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, చింతలపూడి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు మాట్లాడుతూ ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజలంతా సమానమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలంగా నమ్మడం వల్లే అర్హులందరికీ పథకాలు అందేలా చర్యలు తీసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి), వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు, సర్పంచ్ కామిశెట్టి సాయిబాబు, ఎంపీటీసీ శిరిగినీడి లక్ష్మీ సునీత తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు అండగా వడ్డీలేని రుణాలు



నమూనా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): చిరు వ్యాపారులకు వడ్డీ లేని రుణాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం జగనన్న తోడులో వడ్డీ లేని రుణాలను, వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వర్చువల్‌గా తిలకించారు. కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ చిరు వ్యాపారుల ఆర్థిక అభివృద్ధికి జగనన్న తోడు ఎంతో సహాయంగా ఉందన్నారు. ప్రభుత్వం జగనన్న తోడు ద్వారా చిరు వ్యాపారులకు ఆర్థిక భరోసా ఇచ్చే క్రమంలో అండగా నిలవడమే కాకుండా, సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రీయింబర్స్‌మెంట్ నేరుగా జమ చేస్తుందన్నారు. చిరు వ్యాపారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిరు వ్యాపారులు, సంప్రదాయ చేతి వృత్తుల వారు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రీయింబర్స్‌మెంట్ పొందాలన్నారు. అర్హులైన వారు వడ్డీ లేని రుణాలు దరఖాస్తు చేసుకోవాలంటే గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదించాలన్నారు. జిల్లాలో వడ్డీ లేని రుణం పొందిన 22,604 మంది చిరు వ్యాపారుల ఖాతాల్లో వడ్డీ రియంబర్స్‌మెంట్ కింద రూ.51,46,271 జమ చేశారు. 7వ విడతలో 18,779 మందికి రూ.20.23 కోట్ల రుణాలు పంపిణీ చేయడం సంతోషదాయకం అన్నారు. చివరిగా నమూనా చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఎల్‌డీఓ కెసీహెచ్ అప్పారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

రుణాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలి

టిడ్కో లబ్ధిదారులకు రుణాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ పి.ప్రశాంతి బ్యాంకర్లను ఆదేశించారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు మున్సిపల్ కమిషనర్లు, వివిధ బ్యాంకుల ప్రతినిధులతో సమావేశమై టిడ్కో లబ్ధిదారులకు రుణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 75 శాతం నిర్మాణాలు పూర్తయిన వాటికి లోను రిలీజ్ చేయాలని కోరారు. ఇప్పటికే 80 శాతం రుణాలను మంజూరు చేశామని, మిగతా 20 శాతం రుణాలు కూడా జులై 28 లోపు మంజూరు చేయాలని బ్యాంకర్లకు కలెక్టర్ తెలిపారు. తాడేపల్లిగూడెం, భీమవరం, పాలకొల్లు టిడ్కో గృహాల సముదాయంలో ఎస్‌టీపీల నిర్మాణం వెంటనే చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన చోట్ల హైమాస్ట్ లైట్లు ఏర్పాటు తదితర పనులు చేపట్టాలన్నారు.

పితానివి కుల రాజకీయాలు

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



ఆచంట వేమవరంలో ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పార్టీలు, కులాలకు అతీతంగా అభివృద్ధే మతంగా, సంక్షేమమే కులంగా ముందుకు సాగుతున్నట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం పెనుగొండలో 4, 5 సచివాలయం పరిధిలోనూ, ఆచంట మండలం భీమలాపురం, ఆచంట వేమవరంలోనూ నిర్వహించిన జగనన్న సురక్షలో పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందించారు. మార్టేరులో మాజీ మంత్రి పితాని వ్యాఖ్యలపై తీవ్రంగా విరుచుకు పడ్డారు. నియోజకవర్గంలో కులాలను రాజేసి రాజకీయం చేసే అలవాటు మాజీ మంత్రి పితానికి ఉందన్నారు. బలహీనులను వెలివేస్తూ ఇబ్బందులు పాలు చేసేవారికి అండగా నిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. వెలి కేసులో బాధితులు న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయిస్తే, కేసు పెట్టించారంటూ తనపై ఆరోపణలు చేయడం ఎంత వరకూ సమంజసమన్నారు. పెనుగొండలో కోడిపందేల దిబ్బ, నగరేశ్వర స్వామి కాలనీల్లో 14 సంవత్సరాలు పాటు రోడ్లు, మౌలిక సదుపాయాలు లేకుండా కాలయాపన చేసిన ఘనత మాజీ మంత్రి పితానికే దక్కుతుందన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రెండు ప్రాంతాల్లోనూ మౌలిక సదుపాయాల కల్పన చేశామన్నారు. శెట్టి బలిజలకు అధికంగా ఇళ్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కుల రాజకీయాలకు ఎవరూ బలికాకుడదన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలే తిప్పికొడతారన్నారు. కోడి పందేల దిబ్బలో వీధి దీపాలు వేయమని పంచాయతీకి విన్నవించుకొన్నా పట్టించుకోవడం లేదంటూ మహిళలు మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు విన్నవించుకున్నారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు నక్కా శ్యామలసోనీ, జక్కంశెట్టి చంటి, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో సత్వర సేవలందించాలి



తణుకులో సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

తణుకు అర్బన్: సచివాయాలకు వచ్చే ప్రజలకు సచివాలయ సిబ్బంది సత్వర సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. తణుకు పురపాలక సంఘ పరిధిలోని 6వ వార్డు సచివాలయాన్ని ఆయన మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజలకు సేవలందించడంలో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా సచివాలయంలోని సిబ్బంది హాజరుపట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్, రిజిస్ట్రేషన్ వ్యవహారాలను ఆయన పరిశీలించారు. ప్రతి పథకానికి సంబంధించి అర్హుల జాబితాను ప్రతినెలా సచివాలయాల్లో అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు. పురపాలక సంఘ పరిధిలోని 8వ వార్డు ఇంద్రయ్య నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మెను ప్రకారం చిన్నారులకు పోషకాహారం ఇస్తున్నారా, ఎంతమంది చిన్నారులు వచ్చారనే విషయాలను ఆరా తీశారు. స్థానిక పెరవలి రోడ్డులోని దేవదాయ శాఖకు చెందిన 15 ఎకరాల భూమిని ఆయన పరిశీలించి పర్యాటక రంగ అభివృద్ధికి అవసరమైన 3 ఎకరాల భూమిపై అధికారులను ఆరా తీశారు.

పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు

పెనుగొండ: పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జాయింటు కలెక్టరు తెలిపారు. మంగళవారం పెనుగొండ మండలం దొంగరావిపాలెంలో పర్యాటక కేంద్రాన్ని, పర్యాటక భూములను పరిశీలించారు. పర్యాటక కేంద్రాల అభివృద్ధితో యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. మొగల్తూరు మండలం పేరుపాలెం, మోళ్లపర్రు బీచ్‌లను బ్లూఫ్లాగ్ బీచ్‌లుగా ప్రతిపాదించారని, ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ అధికారులు సందర్శించారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎస్.గురుమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డుల కోసం దరఖాస్తులకు ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): జిల్లాలో విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో విశేష సేవలు అందించిన దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థలు/వ్యక్తిగతంగా సేవలు అందించిన వారికి అవార్డుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు జీవీవీ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 3న ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల(వికలాంగుల) దినోత్సవం సందర్భంగా వీరికి అవార్డులు అందించనున్నట్లు చెప్పారు. అర్హులైనవారు ఈ నెల 31 లోగా ఆన్‌లైన్ ద్వారా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 08812–234146 నెంబరులో ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని సహాయ సంచాలకుడు జీవీవీ సత్యనారాయణ కోరారు.

వాన హోరు.. సాగు జోరు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేని వర్షం



భీమడోలులో కురుస్తున్న వర్షం

ఏలూరు(మెట్రో): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణితో ఉమ్మడి పశ్చిమ గోదావరి వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షంతో రైతన్నలు వ్యవసాయ పనుల్లో పూర్తిగా నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు అదను కోసం ఎదురుచూస్తున్న రైతన్నలకు ఈ వర్షం మంచి ఊరటనిచ్చింది. ఈ వర్షాలు మరో నాలుగు రోజులు పాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. రైతులు నారుమడులు మొదలుకుని నాట్ల వరకు పనులు వేగవంతం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు ఇప్పటికే జల్లేరు జలాశయం, కరాటం కృష్ణమూర్తి జలాశయాల్లోకి వరదనీరు వచ్చిచేరుతోంది. అదే విధంగా ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలకు సైతం గోదావరి రంగు మారుతోంది. ఇప్పటికే ఈ వర్షాలకు విలీన మండలాలు, పోలవరం మండలంలో సైతం ప్రజలను జిల్లా యంత్రాంగం అప్రమత్తం చేయగా, ఇప్పటికే సమావేశాలను సైతం ఏర్పాటుచేసి అధికారులను సమాయాత్తం చేశారు.

ఉమ్మడి జిల్లాలో వర్షపాతం ఇలా

సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఉమ్మడి జిల్లాలో వర్షం కురుస్తూనే ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో 6.3 మి.మీ వర్షపాతం నమోదు కాగా, ఏలూరు జిల్లాలో 5.5 మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా చూసుకుంటే ఏలూరు జిల్లాలోని 27 మండలాల్లో 22 మండలాల్లో వర్షం నమోదు కాగా, ఐదు మండలాల్లో సున్నా వర్షపాతం నమోదైంది. పశ్చిమగోదావరి జిల్లాలో 20 మండలాలకు గాను 19 మండలాల్లో వర్షం కురిసింది. పశ్చిమగోదావరి జిల్లాలో అత్యధికంగా పెనుమంట్ర మండలంలో 23.3 మి.మీ వర్షపాతం నమోదుకాగా, అత్యల్పంగా పెంటపాడు, ఇరగవరం మండలాల్లో 1 మి.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా ఏలూరు జిల్లాలో అత్యధికంగా జంగారెడ్డిగూడెం మండలంలో 12.2 మి.మీ వర్షపాతం నమోదుగా కాగా, అత్యల్పంగా నూజివీడు మండలంలో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్లుప్తంగా

హెచ్ఎం భవానీప్రసాద్‌కు అరుదైన గౌరవం


భవానీప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్‌కు భారతరత్న, దక్షిణాఫ్రికా మాజీ అధ్యక్షులు నెల్సన్ మండేలా మెమోరియల్ గ్లోబల్ పీస్ అవార్డు దక్కింది. మంగళవారం నెల్సన్ మండేలా జయంతి సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ప్రత్యేక వర్చువల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భవానీప్రసాద్ మాట్లాడుతూ శాంతి, ఓర్పు, పట్టుదలకు మారుపేరుగా నిలుస్తూ ఎంతోమందిని శాంతికర్తలుగా తయారు చేస్తున్న కొంతమంది సేవకులను గుర్తించి వారికి నెల్సన్ మండేలా మెమోరియల్ గ్లోబల్ పీస్ అవార్డు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ అవార్డుకు ఎంపిక అవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. సంస్థ ప్రతినిధులు దాసరి స్వప్న, మహేష్, పి.సురేష్‌బాబు, పి.అరుణకుమారి, శ్రీనివాస్, బ్రాజ్ కిషోర్ ఆన్‌లైన్ ద్వారా అవార్డు, ప్రశంసా పత్రాన్ని పంపించారన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు భవానీప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

పెన్షనర్లకు ఈకేవైసీ నమోదు తప్పనిసరి


జిల్లా ఖజానాధికారి అడారి గణేష్

భీమవరం (ప్రకాశం చౌక్): రాష్ట్ర ఆర్థిక శాఖ జారీ చేసిన జీఓ ప్రకారం విశ్రాంత ఉద్యోగులు విధిగా ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని జిల్లా ఖజానాధికారి అడారి గణేష్ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఇక నుంచి ఆధార్ చెల్లింపుల విధానం అమలు చేయడానికి ప్రతి విశ్రాంత ఉద్యోగి, పెన్షనర్ తన సీఎఫ్ఎంఎస్ ఐడీకి తన ఆధార్ కార్డుతో అను సంధానమైన ఫోన్ నంబర్‌ను, ప్రస్తుత నివాస చిరునామాను విధిగా నమోదు చేయించుకోవాలని కోరారు. తదుపరి ఖజానా కార్యాలయం, పెన్షన్ అసోసియేషన్ కార్యాలయం ద్వారా ఈకేవైసీని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. ఫోన్, ఎస్ఎంఎస్‌ల ద్వారా వచ్చిన ఓటీపీని తెలియపర్చడంలో ఏదైనా సమస్య ఉంటే ఉపఖజానా కార్యాలయాల్లో సంప్రదించాలని పెన్షనర్లను కోరారు. జిల్లాలోని ఉప ఖజానా కార్యాలయాలైన భీమవరం (63026 18446), ఆకివీడు (95050 53723), నర్సాపురం (73868 59749) కార్యాలయ ఫోన్ నంబర్లలో సంప్రదించాలని గణేష్ సూచించారు.

నో హెల్మెట్.. నో ఎంట్రీ!

- నేటి నుంచి ప్రయోగాత్మకంగా భీమవరంలో అమలు
- తరువాత జిల్లా వ్యాప్తంగా అమలుకు చర్యలు
- హెల్మెట్ ఆవశ్యతపై ఐదు నెలలుగా అవగాహన.. ముగిసిన గడువు


భీమవరంలో హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మోటార్ సైకిళ్ల ర్యాలీలో పాల్గొన్న ఎస్పీ రవిప్రకాష్ (ఫైల్)

సాక్షి, భీమవరం: ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలనే నిబంధనను ఇకపై పోలీసు శాఖ కఠినంగా అమలు చేయనుంది. రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులైన వారిలో హెల్మెట్ ధరించని వారే ఎక్కువగా ప్రాణాలను కోల్పోతున్నట్లు గణాంకాలు తేల్చడంతో హెల్మెట్ ఆవశ్యకతపై ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాలతో జిల్లాలో గత ఐదు నెలలుగా అనేక రూపాల్లో వాహనచోదకులకు పోలీసులు శాఖ అవగాహన కల్పించింది. హెల్మెట్ ధారణ తప్పనిసరి చేస్తూ ఈ నెల 18వ తేదీ వరకు గడువు ఇచ్చింది. ప్రస్తుతం గడువు ముగియనుండటంతో బుధవారం నుంచి ప్రయోగాత్మకంగా జిల్లా కేంద్రం భీమవరంలో 'నో హెల్మెట్.. నో' ఎంట్రీ కార్యక్రమం చేపట్టనుంది. అనంతరం దీనిని జిల్లా వ్యాప్తంగా అమలు చేయనున్నారు.

ఇప్పటివరకు అవగాహనకే పరిమితం

జిల్లాలో ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు హెల్మెట్ ధరించకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు తలకు గాయాలై అనేక మంది మృతి చెందుతున్నారు. దీంతో రోడ్డు ప్రమాదాల్లో మరణాలు నివారించాలనే లక్ష్యంతో ఎస్పీ రవిప్రకాష్ జిల్లా అంతటా ప్రత్యేక హెల్మెట్ డ్రైవ్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 26 లా అండ్ అర్డర్ పోలీసుస్టేషన్స్, భీమవరం, నరసాపురం, తణుకు, తాడేపల్లిగూడెం పట్టణాల్లోని నాలుగు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్స్ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి హెల్మెట్ వాడకంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించని వాహనదారులకు జరిమానా వేయకుండా వారితో అక్కడికక్కడే హెల్మెట్ కొనుగోలు చేయించే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ విధంగా అన్ని పోలీసుస్టేషన్‌ల అధికారులు, సిబ్బంది ప్రతిరోజు ఉదయం, సాయంత్రం జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో కాపు కాచి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. హెల్మెట్ ధరించిన వాహనదారులకు మోటారుసైకిళ్ల ర్యాలీ నిర్వహించి, పువ్వులు పంచి, నమస్కారం పెట్టి అనునయంగా చెప్పారు. మే నెలాఖరు వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తరువాత కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. అయితే వాహనదారులకు జూలై 18వ తేదీ వరకు గడువును పొడిగించిన పోలీసు అధికారులు 19వ తేదీ నుంచి కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. భీమవరంలోని ప్రధానమైన ఆరు రహదారుల్లో పోలీసులు నిఘా వేసి హెల్మెట్ ధరించని వారిని పట్టణంలోనికి రాకుండా అడ్డుకుంటారు. ఎవరైనా హెల్మెట్ తీసుకువచ్చి ఇస్తేనే పట్టణంలో ప్రవేశానికి వారికి అనుమతి ఇస్తారు. భీమవరంలో అమలు అనంతరం జిల్లా అంతటా ఇదే పద్ధతిని అమలు చేస్తారు.

ఇకపై హెల్మెట్ ధారణ తప్పనిసరి



ప్రజాశ్రేయస్సు కోరే హెల్మెట్ వాడకం తప్పనిసరి చేస్తున్నాం. సుమారు 5 నెలల పాటు వాహనచోదకులకు హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించాం. ఎటువంటి జరిమానా వేయకుండా హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలను వివరించి వారితో హెల్మెట్ కొనుగోలు చేయించాం. హెల్మెట్ ఉన్నా కొంతమంది వాడకుండా నిర్లక్ష్యంగా వదిలివేస్తున్నారు. అందువల్లనే భీమవరంలో నో హెల్మెట్ నో ఎంట్రీ పద్ధతిని అమలు చేస్తున్నాం. తరువాత జిల్లా వ్యాప్తంగా అమలుచేస్తాం.

– యు రవిప్రకాష్, ఎస్పీ భీమవరం

స్వాహా సొమ్ము బ్యాంకు చెల్లించాల్సిందే

- లేనిపక్షంలో 21న మహిళలతో బ్యాంకు వద్ద ధర్నా చేస్తా
- బ్యాంక్ మేనేజర్‌ను హెచ్చరించిన ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు


ఆగిరిపల్లిలో బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి (నూజివీడు): మండలంలోని నరసింగపాలెంలో 36 డ్వాక్రా సంఘాలకు చెందిన రూ.70 లక్షలను యూనియన్ బ్యాంకు ఏర్పాటు చేసుకున్న బిజినెస్ కరస్పాండెంట్ (బీసీ) స్వాహా చేసిన నేపథ్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు వారి సొమ్మును బ్యాంకు చెల్లించాల్సిందేనని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు స్పష్టం చేశారు. రెండు రోజుల్లో మహిళలకు న్యాయం చేయకపోతే ఈనెల 21న బ్యాంకు వద్ద ధర్నాకు చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దృష్టికి మహిళలు జరిగిన మోసాన్ని తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే ప్రతాప్ ఆగిరిపల్లిలోని బ్యాంకు వద్దకు నాయకులు, మహిళలతో కలిసి వెళ్లి బ్రాంచ్ మేనేజర్ మిరియాల జగన్‌మోహన్‌రావుతో మాట్లాడారు. బిజినెస్ కరస్పాండెంట్ చేసిన మోసం వల్ల నష్టపోయిన మహిళలకు న్యాయం చేయాల్సిన బాధ్యత బ్యాంకు పైనే ఉందన్నారు. ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్ కట్టించుకోకుండా అనామకుడిని బిజినెస్ కరస్పాండెంట్‌గా ఎలా నియమించారని ప్రశ్నించారు. మహిళలందరూ తమ రుణాల నగదును చెల్లించడానికి బ్యాంకు వద్దకు వస్తే ఇక్కడకు రావాల్సిన అవసరం లేదని, బీసీ వద్దే చెల్లించాలని వెనక్కు ఎందుకు తిప్పిపంపుతున్నారని మేనేజర్‌ను నిలదీశారు. ఒక నెల ఎవరైనా రుణం తాలూకా బాకీని చెల్లించకపోతే వారికి తెలియజేయకపోవడం కూడా బ్యాంకు తప్పిదమేనన్నారు. యూనియన్ బ్యాంకుకు చెందిన బీసీలు నరసింగపాలెంతో పాటు సగ్గూరు, తోటపల్లిలలో కూడా ఖాతాదారులను మోసం చేశారన్నారు. అలాంటి వారినందరిని వెంటనే తొలగించాలన్నారు. బీసీలను నియమించే ఇంటిగ్రా సంస్థ ఏం చేస్తోందని, ఎవరిని పడితే వారిని నియమిస్తే ఎలా అని నిలదీశారు. మహిళలు కూలి పనులకు వెళ్లి రూపాయి కూడబెట్టి తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లిస్తుంటే వారిని మోసం చేసి లక్షలాది రూపాయలు కాజేయడం దారుణమన్నారు. దీనిపై రీజినల్ హెడ్‌తో కూడా ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. తప్పనిసరిగా మహిళలకు వారి సొమ్మును బ్యాంకు చెల్లించాల్సిందేనన్నారు. జెడ్పీటీసీ సభ్యులు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ గోళ్ల అనూష, నూజివీడు రూరల్ సీఐ ఆర్.అంకబాబు, ఆగిరిపల్లి ఎస్సైస నంబూరి చంటిబాబు, తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్, వైఎస్సార్ సీపీ నాయకులు మచ్చా హరిబాబు, అత్తి మురళీ, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

ఇద్దరు ఉద్యోగులపై కేసు నమోదు

ఏలూరు టౌన్: ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి సొమ్ము తీసుకుని మోసం చేశారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై గతంలో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి పరిపాలన విభాగంలో పనిచేసిన ఇద్దరు ఉద్యోగులపై ఏలూరు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు తంగెళ్లమూడి ప్రాంతానికి చెందిన సయ్యద్ లియాఖత్ అలీ నగరంలోని జిల్లా కోర్టులో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తూ విజయవాడ బదిలీ అయ్యారు. ఏలూరు జీజీహెచ్ కార్యాలయ విభాగంలో పనిచేస్తున్న ఏవో ఉమాదేవితో అతనికి పరిచయం ఉంది. ఈ క్రమంలో తమ వద్ద పర్మినెంట్ ఉద్యోగాలు ఉన్నాయని ఆమె అలీకి తెలిపింది. దీంతో అలీ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి అతడితో రూ.4 లక్షలకు ఒప్పందం కుదుర్చుకుంది. దీనికి కార్యాలయంలోని సీనియర్ అసిస్టెంట్ సతీష్ కూడా వత్తాసు పలకటంతో వారు చెప్పే మాటలను నమ్మి అలీ తన కుమారుడి ఉద్యోగం కోసం 2021 సంవత్సరంలో అడ్వాన్స్‌గా రూ.1.60 లక్షలు ఉమాదేవి, సతీష్‌కు చెల్లించాడు. అనంతరం కొద్దిరోజులకే ఉమాదేవి అవినీతి ఆరోపణలపై కడప జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి, సతీష్ పాలకొల్లుకు బదిలీ అయ్యారు. ఉద్యోగం రాకపోవడం, కనీసం డబ్బులైనా ఇవ్వాలని అడుగుతుంటే వారు కాలం గడుపుతూ ఉండడంతో విసుగు చెందిన బాధితుడు అలీ ఏలూరు టూటౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'ఉద్యానం'లో జీవ నియంత్రణ విధానాలు మేలు


మాట్లాడుతున్న ఉపకులపతి జానకిరామ్

ద్వారకాతిరుమల: రైతులు ఉద్యాన పంటల సాగులో యాంత్రీకరణ, చీడపీడల నివారణకు జీవ నియంత్రణ పద్ధతులను అవలంబించాలని వెంకట్రామన్నగూడెం ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి జానకిరామ్ అన్నారు. వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం మన గ్రామం–మన విశ్వవిద్యాలయం కార్యక్రమంలో భాగంగా ద్వారకాతిరుమల మండలం నారాయణపురం గ్రామాన్ని దత్తత గ్రామంగా ఎంపిక చేశారు. ప్రారంభ కార్యక్రమాన్ని నారాయణపురం రైతు భరోసా కేంద్రంలో మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యాన కళాశాల ఉపకులపతి జానకిరామ్ మాట్లాడుతూ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఉన్న నాణ్యమైన నారు మొక్కలను తీసుకోవాలన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు సమతుల్య ఎరువుల యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన దిగుబడులు పొందవచ్చన్నారు. విస్తరణ సంచాలకులు కరుణశ్రీ మాట్లాడుతూ అన్ని రకాల పంటలపైనా అవసరమైన సాంకేతికతను కేవీకే శాస్త్రవేత్తల ద్వారా తెలుసుకోవాలన్నారు. పంటల సాగులో జీవన ఎరువులు తప్పనిసరిగా ఉపయోగించాలని, తద్వారా 25 నుంచి 30 శాతం వరకు రసాయన ఎరువులు వినియోగం తగ్గించుకోవచ్చన్నారు. వ్యవసాయ క్షేత్రాల్లో డ్రోన్ ద్వారా మందులు పిచికారీ, ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు. మండల ఉద్యాన అధికారి ఎ.దేవానందం, బుట్టాయిగూడెం సర్పంచ్ కె.నాగసుబ్రమణ్యం, ద్వారకాతిరుమల మండల వ్యవసాయ సలహాల మండలి బోర్డు చైర్మన్ యం.ఈశ్వర్ రెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు శాలిరాజు, కె.వెంకట సతీష్, గ్రామ ఉద్యాన సహాయకురాలు నిహారిక, రైతులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

15 మంది అరెస్టు, రూ.1,84,400 నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున పేకాట స్థావరంపై సెబ్, స్థానిక పోలీసులు ఆకస్మిక దాడి చేశారు. పేకాడుతున్న 16 మంది వ్యక్తుల్లో ఒకరు పరారు కాగా 15 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.1,84,400 నగదు, 13 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సత్యసాయి చెప్పారు. జిల్లా ఎస్పీ రవిప్రకాష్, అదనపు ఎస్పీ (సెబ్) ఏటీవీ రవికుమార్, ఏఈఎస్ సెబ్ సి.భార్గవి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. దాడుల్లో డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కె.కోటేశ్వర్, ఎస్సై అడబాల సతీష్, సెబ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారన్నారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఆనాల చెరువుగట్టుపై..

స్థానిక ఆనాల చెరువు గట్టుపై మంగళవారం పేకాడుతున్న నలుగురు వ్యక్తుల్ని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.3,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సత్యసాయి చెప్పారు. వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముసునూరు: ట్రాక్టర్లలో ఇసుక అక్రమంగా రవాణాను అడ్డుకుని ముసునూరు పోలీస్‌స్టేషన్‌కు వాటిని తరలించినట్లు ఏస్సై ఎం.కుటుంబరావు మంగళవారం చెప్పారు. బలివేలోని తమ్మిలేరు ఇసుక ర్యాంపు నుంచి సోమవారం రాత్రి అనుమతి లేకుండా ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసి తరలిస్తున్న బలివేకు చెందిన నాయుడు కొండయ్య, కొప్పుల వెంకటేశ్వరరావులను అదుపులోకి తీసుకుని ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గోపవరంలోని మాకినేనివారి చెరువునుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లు, ఒక జేసీబిని పట్టుకుని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదేశాలతో ముసునూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ దాసరి సుధ తెలిపారు. వాహనదారులపై మంగళవారం క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీలోకి వగ్వాల చేరిక

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే వాసుబాబు


వాసుబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన వగ్వాల అచ్యుతరామారావు


భీమడోలు: గుండుగొలనులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు, వైఎస్సార్ సీపీ మాజీ జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యుడు వగ్వాల అచ్యుతరామారావు మంగళవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గుండుగొలనులో మంగళవారం జరిగిన జగనన్న సురక్షా కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో వాసుబాబు వగ్వాల అచ్యుతరామారావును పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించిన వగ్వాల కొన్ని కారణాల రీత్యా పార్టీని వీడారు. అయితే ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు గ్రామంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ పునఃనిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.1.5 కోట్ల నిధుల మంజూరు చేయించారు. దీంతో వగ్వాల అచ్యుతరామారావు ఆలయాన్ని నిర్మించడంలో తన వంతు కృషి చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులైన వగ్వాల అచ్యుతరామారావు ఎమ్మెల్యే వాసుబాబు సమక్షంలో పార్టీలో చేరారు. వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి సీఎం కావడం ఖాయమని వగ్వాల అచ్యుతరామారావు తెలిపారు. పార్టీ బలోపితానికి తమ వంతు కృషి చేయాలని వాసుబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ సభ్యులు తుమ్మగుంట భవానీ రంగ, జిల్లా సమన్వయ కమిటీ సభ్యుడు చిలువూరి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేఎస్ రామవరంలో విజిలెన్స్ దాడి


పురుగుమందులను స్వాధీన పరుచుకున్న విజిలెన్స్ అధికారులు

కామవరపుకోట: లైసెన్స్ లేకుండా ఎరువులు అమ్ముతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు, పురుగుమందులను స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ సీఐ యూజే విల్సన్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం విజిలెన్స్ ఎస్పీ కరణం కుమార్‌కు అందిన ముందస్తు సమాచారం మేరకు మండలంలో కేఎస్ రామవరంలో చిక్కాల సుబ్బారావు ఇంటిపై మంగళవారం దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన తనిఖీల్లో లైసెన్స్ లేకుండా అక్రమంగా పురుగుమందులు, ఎరువులు, కేంద్ర ప్రభుత్వం నిషేధించిన 15 లీటర్ల గ్లెకైోసిల్ కలుపుమందు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. రూ.1,55,200 విలువైన పురుగుమందులు, రూ.32,450 విలువైన ఎరువులను స్వాధీనం చేసుకుని చిక్కాల సుబ్బారావుపై, ఇతనికి ఎరువులు విక్రయించిన పత్తి కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ విల్సన్ తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్సై రంజిత్ కుమార్, మండల వ్యవసాయ అధికారి సి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

నేటి నుంచి మొహర్రం నెల ప్రారంభం


ఏలూరు గొలుసుల పంజాలో పీర్లు (ఫైల్)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇస్లాం ధర్మస్థాపనకై ప్రాణత్యాగం చేసిన ముహమ్మద్ ప్రవక్త మనవడు హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగానికి గుర్తుగా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే మొహర్రం నెల బుధవారం నుంచి ప్రారంభం కానుంది. కర్బలా యుద్ధంలో మరణించిన ఇమామ్ హుస్సేన్‌ను స్మరిస్తూ అమర వీరుల నెలగా ముస్లింలు ఈ నెలను పరిగణించి పండుగలా కాకుండా వర్ధంతిలా జరుపుకుంటారు. అలాగే ఇదే రోజు నుంచి ఇస్లాం నూతన సంవత్సరం కూడా ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ప్రజలు సుఖ సంతోషాలతో, క్షేమంగా, ఆర్థికంగా ఉన్నత స్థానంలో ఉండాలని కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఈ మొహర్రం నెల ప్రారంభానికి సూచికగా నగరంలోని పలు ప్రాంతాల్లో పీర్లను నిలబెట్టనున్నారు. స్థానిక కుండీ సెంటర్లోని హజరత్ మౌలా అలీ మహాత్ముల వారి ఆస్థాన (గొలుసుల పంజా)లో బుధవారం పీర్లు నిలబెట్టి విశేష ప్రార్థనలు నిర్వహించనున్నట్లు ఆ పంజా వంశపారంపర్య ముజావరులు ఎండీ వజీర్ అలీ, ఎండీ గాలబ్ అలీ తెలిపారు. వీటితో పాటు నగరంలోని గస్ బజారు ప్రాంతంలో జల్‌జలా సాహెబ్ ఆస్థాన, గడియార స్తంభం సెంటర్‌లోని బీకా పంజా, పోణంగి రోడ్డులోని కోడిగుడ్డు పంజా, చేపలతూము సెంటర్‌లోని సింగమహల్లా పంజాల్లో సైతం మొహరం నెలలో పీర్లు నిలబెట్టి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. అలాగే ఈ కార్యక్రమాల్లో భాగంగా పలు పంజాల వద్ద నిప్పుల గుండం తొక్కే కార్యక్రమం నిర్వహిస్తారు. మొహర్రం నెల ప్రారంభమైన 11వ రోజున నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిలబెట్టిన పీర్లను స్థానిక కర్బలా మైదానంలో నిమజ్జనం చేస్తారు.

ఎస్ఈబీ దాడుల్లో ముగ్గురి అరెస్టు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్ఈబీ అధికారులు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. చింతలపూడి, లింగపాలెం మండలాల్లో జరిపిన ఈ దాడుల్లో మద్యం, సారా స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుంకర సాయి స్వరూప్ తెలిపారు. చింతలపూడిలో నిర్వహించిన దాడుల్లో తొమ్మండ్రు వెంకటేశ్వరరావును అరెస్టు చేసి అతని వద్ద నుంచి తెలంగాణ రాష్ట్రానికి చెందిన 183 ఎన్‌డీపీ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్ల రవాణాకు సహకరించిన టి.నరసాపురానికి చెందిన ఎన్.ప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. లింగపాలెం మండలం వేములపల్లిలో నిర్వహించిన దాడుల్లో దంపనబోయిన నరసింహారావుని అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని, అలాగే 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్సై దుర్గాప్రసాద్, బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదిక సురక్ష

పలు ప్రాంతాల్లో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాల పంపిణీ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వ పథకాలు అందని ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరమని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే.మల్లిఖార్జునరావు అన్నారు. మంగళవారం మండలంలోని కుంచనపల్లి, పెదతాడేపల్లి-1, 2 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కుంచనపల్లిలో జరిగిన సభలో డీపీవో మల్లిఖార్జునరావు మాట్లాడుతూ అర్హత ఉండి వివిధ కారణాలతో ప్రభుత్వ పథకాలు అందని వారిని గుర్తించడం జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తద్వారా ప్రజల అవసరాలను గుర్తించి, ధ్రువపత్రాలను అందించడం జరుగుతుందన్నారు. పెదతాడేపల్లి-1, 2 సచివాలయాల్లో జరిగిన కార్యక్రమాల్లో తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ మాట్లాడారు. అనంతరం కుంచనపల్లిలో 2050, పెదతాడేపల్లిలో సచివాలయం-1 పరిధి 2573, సచివాలయం-2 పరిధి 2438మందికి ధృవపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతుల అన్నవరం, ఈవోపీఆర్డీ ఎం.వెంకటేష్, ఏవో ఆర్ఎస్.ప్రసాద్, సీఎస్ డీటీ నందన్ రావు, పంచాయతీ కార్యదర్శి టి.రవిచంద్ర, సొసైటీ చైర్మన్ పరిమి తులసీదాస్, గ్రామ పార్టీ కన్వీనర్ కారింకి వీర్రాజు, నాయకులు మద్దుకూరి రామావతారం, పరిమి మునీంద్ర, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


తాడేపల్లిగూడెం రూరల్: కుంచనపల్లిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న డీపీవో మల్లిఖార్జునరావు


పెంటపాడు: ప్రత్తిపాడు సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం


తణుకుటౌన్: తేతలిలో జరిగిన జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

జగనన్న సురక్ష సర్వే సమర్థవంతంగా నిర్వహించాలి

పెంటపాడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) జీవీకే మల్లికార్జునరావు కోరారు. జగనన్న సురక్ష సర్వే కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెంటపాడు మండలం ప్రత్తిపాడు గ్రామంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారులతో మాట్లాడి ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీవీ శేషగిరిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, వైఎస్సార్ సీపీ నాయకులు వీర్ల గోవింద్, వీర్ల ధనరాజు, వీర్ల వెంకటేష్, కలిశెట్టి ధనరాజు, కండెల్లి వెంకట్రావు, పిన్నింటి రాంబాబు, ఈవోపీఆర్డీ ప్రసాద్, ఏవో పార్థసారథి, హౌసింగ్‌శాఖ డీఈ ఏవీఎస్‌వీ ప్రసాద్, ఏఈ శివరామకృష్ణ, గ్రామ కార్యదర్శి చక్రవర్తి, వీఆర్వో భువన గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు. పరిమెళ్ల సచివాలయం వద్ద సర్పంచ్ గొర్రెల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మండా శివరామకృష్ణ, పార్టీ నాయకులు కడియం రాంబాబు, గ్రామ ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, ఎంపీడీవో బాలాజీ, వీఆర్వో రామచంద్రరావు, కార్యదర్శి నాగదేవి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా జగనన్న సురక్ష శిబిరాలు

ఇరగవరం: మండలంలోని కె ఇల్లిందలపర్రు, గోటేరు గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు , జెడ్పీటీసీ పంపన అంజి బాబు, ఎంపీపీ అలివేలు మంగ తాయారు, కె ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, జుత్తిగ గాయిత్రి దేవి, ఎంపీటీసీ జుత్తిగ రాజేశ్వరి, నాయకులు జుత్తిగ కిషోర్, గరికిపాటి సతీష్, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ఇరగవరం: ఇల్లిందలపర్రులో లబ్ధిదారుడికి ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం


తణుకు అర్బన్: తణుకులో జగనన్న సురక్ష కార్యక్రమంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న బలరామకృష్ణ తదితరులు

జగనన్న సురక్ష ఎంతో మేలు

తణుకు అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశ్యమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ అన్నారు. తణుకులో 24, 25, 26 వార్డుల్లోని బ్యాంక్ కాలనీ, గంధం వారి వీధి, లక్ష్మి థియేటర్ వెనుక వీధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆకుల కిరణ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, నాయకులు చేశెట్టి లలితా శంకర్, మొహిద్దీన్, రేలంగి రాంబాబు, పైడి పద్మ, కె.శ్రీదేవి, షేక్ అబ్దుల్ ఖాదర్, జిలానీ, సురేష్ రెడ్డి, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

అత్తిలి: ప్రజలకు పక్కాగా ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో నిర్వహిస్తున్న జగనన్న సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ కొరెడ్డి బాలాజీ, ఉపసర్పంచ్ తలారి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, సొసైటీ అధ్యక్షుడు గుబ్బల ఆంజనేయులు, జేసీఎస్ మండల కన్వీనర్ పెన్మెత్స రామరాజు, ట్రస్టుబోర్డు చైర్మన్ ధనుమూరి తాతాజీ, రాయుడు ధర్మారావు, తోట వెంకటేశులు, ఆకుల మురళీకృష్ణ, తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు పాల్గొన్నారు.

తణుకు మండలంలో ముగిసిన జగనన్న సురక్ష శిబిరాలు

తణుకు టౌన్: ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా వివిధ రకాల సర్టిఫికేట్ల పంపిణీలో తణుకు మండలం రాష్ట్ర స్థాయిలో నిలిచినట్లు అధికారులు పేర్కొన్నారు. తణుకు మండలంలోని సచివాలయాల స్థాయిలో నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ శిబిరాలు మంగళవారం ముగిశాయి. మంగళవారం తణుకు రూరల్ మండలం తేతలి 2, మండపాక 2 సచివాలయాల్లో జగనన్న సురక్ష గ్రామ శిబిరాలను నిర్వహించారు. తేతలి గ్రామంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతి ప్రియ, ఎంపీడీవో పీ శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి ఎం. ఆశా రోహిణి, మండల జేజీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్, మండల వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, గ్రామ కార్యదర్శులు వెంకటనారాయణ, ఎం డాక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్వీ రంగారావుకు భారత రత్న ఇవ్వాలి


ఎస్వీఆర్‌కు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వనట చక్రవర్తి ఎస్వీ రంగారావుకు భారతరత్న ఇవ్వాలని ఎస్వీఆర్ సేవా సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు ఎస్వీఆర్ సర్కిల్ వద్ద మంగళవారం ఎస్వీ రంగారావు 49వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. సేవా సంఘం ఆధ్వర్యంలో ఎస్వీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారతరత్న ఇవ్వాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భోగిరెడ్డి రాము, మారిశెట్టి సుబ్బారావు, కె.అనిల్, పి.కుమార్‌స్వామి, ఎల్.శేషు, రాగిరెడ్డి ప్రసాద్, వర్ధినీడి వరదరాజులు, అప్పాజీ, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సహాయం చేద్దాం


వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న దాతలు, తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు, వృద్ధులకు సహాయం చేద్దామని పలువురు దాతలు జొన్నల సతీష్ కుమార్, పూతినీడి శివరామకృష్ణలు పేర్కొన్నారు. పడాల జీవన సంధ్య వృద్ధాశ్రమంలో మంగళవారం దాతల సహాయ సహకారాలతో అన్నదానం, పండ్లు అందజేశారు. లార్డ్స్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌లో అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో వశిష్ట లియో క్లబ్ సభ్యులు జి.వెంకట పద్మావతి, పావని స్నిగ్ధ, జి.వి.మణికంఠ, రవి తేజ, తిలక్ కుమార్, సుశీల, భ్రమరాంబికా, కావ్యారెడ్డి, రేణుక, కమల, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ఉచిత వైద్యశిబిరం


తణుకులో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలందిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సజ్జాపురం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన శిబిరానికి హాజరైన 30 మందికి వైద్యులు డాక్టర్ భూపతిరాజు రమేష్‌చంద్రబాబు వైద్యసేవలందించారు. ఈ సందర్భంగా బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి వైద్యసలహాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, కోశాధికారి అడ్డాల వెంకటకృష్ణారావు, మాజీ అధ్యక్షుడు మాదిరెడ్డి బాబూజీరావు, సభ్యులు గుణ్ణం వెంకట్రావు, కె.దాసు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు అడ్డాల సత్యనారాయణ పాల్గొన్నారు.

హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, షరతులు లేకుండా అమ్మఒడి పథకాన్ని కుటుంబంలో విద్యార్థులందరికీ మంజూరు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుందర్, టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం భీమవరం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నా నుద్దేశించి మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్, కాస్మోటిక్ చార్జీలు నెలకు రూ. 3 వేలు ఇవ్వాలని, అమ్మాయిల రక్షణ కోసం హాస్టళ్ల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి జి గణపతిరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్లలో 14 మందికి ఉద్యోగాలు

సాక్షి, భీమవరం : పాలకొల్లు చాంబర్స్ కళాశాలలో ఇటీవల నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్లలో భీమవరం డీఎన్నార్ కళాశాల విద్యార్థులు 14 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు చెప్పారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణ రాజు(బాబు), వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జే సోమరాజు, పి.రామకృష్ణంరాజు, కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎండీ శిరాజ్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి పి.శిరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ హనుమ, ఎంఈఓ జ్యోతి తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బడిఈడు పిల్లలు బడిలో ఉండేలా చూడాలని మండల విద్యాశాఖాధికారి హనుమ, జ్యోతిలు అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం మండల సమావేశ మందిరంలో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల యాజమాన్య ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ హనుమ మాట్లాడుతూ పాఠశాల సెలవు రోజులు, పండుగ రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాల రికార్డులను స్వాధీనం చేసుకొని కలెక్టర్‌కు సరెండర్ చేస్తామన్నారు. పాఠాలతో పాటు ఆట పాటలు కూడా అవసరమేనని, పిల్లల మానసిక స్థితితో ఆడుకోవద్దని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలను ఈ సందర్భంగా హెచ్చరించారు. పాఠశాలలో తరగతి గదులు, ఆరుబయిట పరిసరాలు పరిశుభ్రత ఉండే విధంగా చూడాలన్నారు. పిల్లల అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేద్దామని, ఈ సందర్భంగా సహకరించాలని కోరారు. అపుస్మా, అప్స యూనియన్ సభ్యులు సుంకర శ్రీనివాస్, తూము శ్రీనివాస్, పాఠశాలల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మధుమేహంను అశ్రద్ధ చేయవద్దు అని ఫైర్ ఆఫీసర్ గణేశ్న వెంకట రామారావు అన్నారు. షుగర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన రావాలని, సీజనల్ వ్యాధులు పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరుతూ లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ ఆధ్వర్యంలో క్లబ్ సెక్రటరీ మద్దూకూరి మెహర్ ప్రసాద్ సౌజన్యంతో మంగళవారం అర్ అండ్ బి గృహం వద్ద వైద్య శిబిరం రక్త పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు జరిగాయి. జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు శిబిరంను పర్యవేక్షించారు. వక్తలు మాట్లాడుతూ వ్యాయామం, నడక, యోగా, మంచి ఆహారపు అలవాట్లు ప్రతి ఒక్కరికి అవసరం అన్నారు. లయన్స్ సేవా కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మానేపల్లి సుబ్బారావు గుప్తా, మునగాల జితేంద్ర, గ్రంధి ప్రసాద్, మానేపల్లి కిరణ్, బెజవాడ రాంబాబు, ఆర్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ల వినియోగంపై అవగాహన పెంచుకోవాలి


మహిళా రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

తాడేపల్లిగూడెం: అందుబాటులోకి వస్తున్న నూతన సాంకేతిక పద్ధతులను రైతులు అందిపుచ్చుకొని వ్యవసాయంలో అమలు చేస్తే , ఖర్చులు తగ్గి లాభాలు పెరుగుతాయని కెవికె శాస్త్రవేత్తలు తెలిపారు. ఐసీఏఆర్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వెంకట్రామన్నగూడెంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు, మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీలతో పాటు వ్యవసాయ డ్రోన్ల వినియోగంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. నూతన వంగడాలు, మల్చింగ్ ఆవశ్యకత గురించి వివరించారు.విద్యార్థులతో పాటు కొయ్యలగూడెం, రంపచోడవరం, బుట్టాయగూడెం ప్రాంతాల నుంచి మహిళా రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు ఎమ్.రాఘవేంద్రరెడ్డి, ఏ.దేవీవరప్రసాదరెడ్డిలు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


పేకేరులో డెంగ్యూ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఇరగవరం: పరిసరాల పరిశుభ్రతను ప్రజలు పాటించాలని తణుకు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పేకేరు గ్రామంలో మంగళవారం పేకేరు శివారు పితాని వారి పాలెం ఏరియాలో ఫీవర్ సర్వే, డెంగ్యూ నివారణ మాసోత్సవం నిర్వహించారు. తణుకు సబ్ యూనిట్ ఆఫీసర్ జి వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈడిస్ దోమ కుట్టడం వల్ల డెంగ్యూ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. ఈ దోమలు పుట్టకుండా ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రై డే గా పాటించాలని వివరించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంటు ఎస్ సూర్యనారాయణ సబ్ యూనిట్ అసిస్టెంటు ఎం శ్రీనివాస్, తాతజీ, గ్రామ ఆరోగ్య కార్యదర్శి ఎం రేవతి,ధనలక్ష్మి, సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలుచేయాలి


సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

సాక్షి, భీమవరం : రైతులు ఏడాదిపాటు చేసిన పోరాటానికి దిగివచ్చి కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని, మద్దతు ధరలు గ్యారెంటీ చట్టాన్ని తేవాలని, రుణ విమోచన చట్టం చేయాలని, విద్యుత్ సంస్కరణలు నుంచి వ్యవసాయాన్ని మినహాయించాలని సంయుక్త కిసాన్ మోర్చా సమావేశం డిమాండ్ చేసింది. మంగళవారం భీమవరంలోని సీఐటీయూ కార్యాలయంలో అఖిలపక్ష రైతు సంఘాలు, కార్మిక సంఘాలు సమావేశం అఖిలభారత అగ్రగామి కిసాన్ సభ రాష్ట్ర అధ్యక్షుడు లంకా కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు మాట్లాడుతూ రుణ విమోచన చట్టం తీసుకువచ్చి రైతుల ఆత్మహత్యలను నివారించాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయకుంటే రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి రైతులు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో రైతు నాయకులు తమ్మినేని నాగేశ్వరావు, దండు శ్రీనివాసరాజు, ఎం.రామాంజనేయులు, కె జార్జి, జక్కంశెట్టి సత్యనారాయణ, జేఎన్వీ గోపాలన్, బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

చదరంగం క్రీడతో ఉజ్వల భవిష్యత్తు


చదరంగం పోటీలను ప్రారంభిస్తున్న కొట్టు విశాల్, సీహెచ్ఏఆర్‌కే వర్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): చదరంగం క్రీడతో పిల్లలకుఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వైఎస్సార్ సీపీ నాయకులు కొట్టు విశాల్ అన్నారు. స్థానిక డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో మాస్టర్స్ చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లిగూడెం మండల స్థాయి అండర్-16 చెస్ టోర్నమెంట్‌ను మంగళవారం విశాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జీవితంలో మరచిపోలేని క్రీడ చదరంగం అన్నారు. పిల్లల్లో క్రమశిక్షణ, చురుకుతనంను చదరంగం క్రీడ పెంచుతుందన్నారు. చదువుల్లో రాణించేందుకు క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందని వెల్లడించారు. మాస్టార్ చెస్ అకాడమీ ఛైర్మన్ సీహెచ్ఏఆర్‌కే వర్మ మాట్లాడుతూ క్రీడాకారులు చక్కగా రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ముందుకు సాగాలన్నారు. ఛీఫ్ ఆర్బిటర్ జీవీ కుమార్ మాట్లాడుతూ టోర్నమెంట్‌లో తొలి మూడు స్థానాలు సాధించిన వారు ఈ నెల 22, 23 తేదీల్లో భీమవరంలో జరిగే టోర్నమెంట్‌కు ఎంపిక అవుతారని చెప్పారు. సీహెచ్ఏఆర్‌కే వర్మ, కొట్టు విశాల్ మధ్య ఆసక్తికరమైన పోటీ జరిగింది. ఈ కార్యక్రమంలో చెస్ అకాడమీ కార్యదర్శి చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు గిరిబాబు, చిన్నారులు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

అమ్మాయి రుణం తీర్చుకోలేను



అమ్మాయి రుణం తీర్చుకోలేను

నాపేరు లక్ష్మీకుమారి. నేను తణుకు పట్టణంలో నివసిస్తున్నారు. మా వలంటీర్ రత్నం సేవలు మరిచిపోలేను.నాకు కోవిడ్ సమయంలో కూడా ఎంతో సేవ చేశారు. మా పిల్లల చదువులకు సంబంధించి నాకు ప్రభుత్వం అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన అందుతోంది. వలంటీరు వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన అనంతరం మాకు ఏమి కావాలో అన్ని ప్రభుత్వం ఏమి రావాలో అన్ని పథకాలను అందిస్తున్నారు.

– వి.లక్ష్మీ కుమారి, తణుకు

వలంటీర్ సేవలకు సలాం



ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను మా వలంటీరు అగేష్ మా గడపలోకే తీసుకువచ్చి అందిస్తున్నారు. మాకు ఎటువంటి విషయం తెలుసుకోవాలన్నా మా వలంటీరును సంప్రదిస్తాం. మాకు ఇంటిస్థలం వచ్చింది. వైఎస్సార్ చేయూతతో పాటు టైలరింగ్ నిమిత్తం ప్రభుత్వం రూ. 10వేలు ఏడాదికి ఇస్తుంది. ప్రభుత్వం నుంచి అందుతున్న ఈ పథకాలన్నీ కూడా వలంటీరు ద్వారానే మాకు అందుతున్నాయి.

– వి.సింహాచలం, తణుకు

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

సాక్షి, భీమవరం : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీజీ అందించిన స్వాతంత్ర్య ఫలాలు అనే అంశంపై రెండు పేజీలకు మించకుండా వ్యాసాన్ని రాసి ప్రధానోపాధ్యాయుడు, ప్రిన్సిపాల్ ధ్రువీకరణ పత్రం ఆగస్టు 6వ తేదీ లోపుగా పంపించాలన్నారు. విజేతలకు పాఠశాల, కళాశాల స్థాయిలో వేరువేరుగా బహుమతులు అందచేస్తామన్నారు.

జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా వింజమూరి

నరసాపురం రూరల్: పద్మశాలి సంఘం పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా నరసాపురం మండలం చిట్టవరం గ్రామానికి చెందిన వింజమూరి నాగ వెంకటసురేష్ కుమార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉమ్మడి పద్మశాలి సంఘం అధ్యక్షుడు వానపల్లి నాగరాజు నుంచి నియామకపు ఉత్తర్వు అందుకున్నట్టు సురేష్ కుమార్ తెలిపారు. పద్మశాలీ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామన్నారు.

ఎన్ని నాటకాలాడినా ఫలితం ఉండదు

పెనుగొండ: టీడీపీ ఎన్ని కుయక్తులు పన్నినా, నాటాకాలడినా ఫలితం ఉండదని, మరోసారి సీఎం జగన్ ముఖ్యమంత్రి అవడం ఖాయమని విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంపై విమర్శలు చేశారు. భవిష్యత్ గ్యారెంటీలో టీడీపీ చెప్పి అబద్ధాలు తట్టుకోలేక స్టేజీ కూలిపోయిందని, వారి ఏర్పాటు చేసిన స్టేజీకే గ్యారెంటీ లేదని, రాష్ట్ర ప్రజలకు గ్యారెంటీ ఎక్కడదని ప్రశ్నించారు. సరికొత్త మ్యానిఫెస్టో అంటూ చైతన్య రథయాత్ర అంటూ టీడీపీ నాయకులు ప్రజల్లోకి వెళుతున్నా ఎటువంటి ప్రయోజనం ఉండదని అన్నారు. రాబోయే ఎన్నికల్లో 175 సీట్లు సాధించి జగన్ సీఎం అవడం ఖాయమన్నారు. వాస్తవాలను టీడీపీ గ్రహించాలని హితవు పలికారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో రేపు జాబ్ మేళా

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో దివీస్ లాబోరేటరీస్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. 2019 నుంచి 2022, 2023 (ఫైనల్ ఇయర్) డిగ్రీ ఏదైనా బీఎస్సీ కెమిస్ట్రీ ఒక సబ్జెక్టు చదివిన, పీజీలో ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనలటికల్ కెమిస్ట్రీ, ఎం ఫార్మసీ, (పీఏ అండ్ క్యూఏ), బీ ఫార్మసి చదివిన విద్యార్థులు అర్హులన్నారు. బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరవ్వాలని కోరారు. పూర్తి వివరాలకు కళాశాల వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. జేకేసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ప్లేస్మెంట్ ట్రైనర్ ఎం.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు


మాట్లాడుతున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98శాతం నేరవేర్చి ఏకైకపార్టీ వైఎస్సార్ సీపీయేనని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు తెలిపారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో మంగళవారం జరిగిన సమావేశంలో మంగరాజు మాట్లాడుతూ వివిధ రకాల సర్టిఫికెట్స్ కోసం ఉచితంగా అప్లై చేస్తే వలంటీర్, సచివాలయం వ్యవస్థ ద్వారా ఇంటికి పట్టుకొని రావడం దేశంలోనే ఏపీ ప్రభుత్వం మొదటిగా నిలిచిందన్నారు. వలంటీర్ వ్యవస్థను ప్రధాని మోడీ సైతం ప్రసంశించారని వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, చవ్వాకుల భరత్, తెన్నేటి జగజ్జీవన్, సింగం త్రిమూర్తులు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తణుకు టౌన్ : తణుకు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తణుకు ఐసీడీఎస్ సీడీపీవో ఎంటీఎస్ ప్రమోద కుమారి తెలిపారు. ఇరగవరం మండల కావలిపురం గ్రామంలోని నెంబరు 2 అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్వాడీ వర్కర్ పోస్టు బీసీ ఏ కేటగిరీకి, ముద్దాపురం గ్రామంలోని నెంబరు 2 అంగన్వాడీ కేంద్రంలో వర్కర్ పోస్టు ఎస్సీలకు కేటాయించినట్లు తెలిపారు. అత్తిలి మండలం స్కిన్నెరపురం సహాయకుల పోస్టులను బీసీ ఏలకు, కే సముద్రం గట్టు 1వ కేంద్రంలో ఓసీ పీహెచ్‌కు, అత్తిలి 3వ కేంద్రంలో ఓపెన్, ఈడూరు 2 ఎస్సీ కేటగిరీలకు కేటాయించినట్లు తెలిపారు. ఈపోస్టులకు స్థానికులైన వివాహిత మహిళలే అర్హులని, వయస్సు 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య ఉండాలని తెలిపారు. కనీసం పదో తరగతి చదివి ఉండాలని, అదనపు విద్యార్హతలు ఉన్న వారికి ప్రాముఖ్యత ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తులను ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.